AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## మొదటిరోజు 51మంది గైర్హాజరు

**అక్షరటుడే, ఇందూరు:** పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షను ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 144 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 24,404 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఉండగా..24,353 మంది హాజరయ్యారు. 51 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ 9 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 52 కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని, చూచిరాత కేసులు కూడా నమోదు కాలేదని డీఈవో తెలిపారు.





## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి: సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, బోధన్:** గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శనివారం సందర్శించారు. వచ్చే ఏడాది 2027లో జూన్ 26వ తేదీ నుంచి జులై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రధానమైన కందకుర్తి పుష్కర ఘాట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి, చేపట్టాల్సిన పనుల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదావరి, మంజీర, హరిద్ర నదుల కలయికతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధి గాంచిన కందకుర్తి ప్రాంతానికి పుష్కర స్నానాల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. గత పుష్కరాలను బట్టి చూస్తే ఈసారి కూడా ప్రతి రోజు సగటున రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎక్కడ కూడా అసౌకర్యాలు ఏర్పడకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా పక్కాగా పనులు జరిపించాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఉన్నారు.

## వేముల ప్రశాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ




**అక్షరటుడే, భీమ్‌గల్:** మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించు కొని రాజకీయ ప్రముఖులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తమ జన్మదినం సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనకు ఆశీస్సులు అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో వేముల ప్రశాంత్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని ఈ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షించారు.

## 16న ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టుబడ్డ వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు శాఖ ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ సమీపంలోని శాఖ కార్యాలయంలో 16న వాహనాల వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ముందుకు రూ.5వేల ధరవాత్తు చెల్లించాలని సూచించారు. ఆసక్తి గల వ్యక్తులు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జిల్లాలోని నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీల పరిధిలో అనుమతులకు విరుద్ధంగా కట్టడాల సంఖ్య పెరుగుతుంది. నిబంధనలు పాటించని వారికి ప్రభుత్వం భారీగా జరిమానా విధిస్తున్నా.. కొత్త భవనాలు నిర్మించుకునే వారు మాత్రం మారడం లేదు. పట్టణ ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోవడం.. నిర్మాణం ప్రారంభమై శ్లాబులు వేసిన తర్వాత నోటీసులు ఇవ్వడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది.

- అక్షరటుడే, ఇందూరు



# ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

■ నిబంధనలు పాటించని వైనం ■ అనుమతులకు విరుద్ధంగా కట్టడాలు ■ నోటీసులకే పరిమితం

జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతోపాటు ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే భవన నిర్మాణాల సమయంలో తీసుకుంటున్న అనుమతులకు క్షేత్రస్థాయిలో నిర్మిస్తున్న భవనాలకు పూర్తిగా భిన్నంగా ఉంటున్నాయి. కొందరు ఖర్చుల భారంతో అనుమతులు తీసుకున్న మేరకు కాకుండా శ్లాబులు తగ్గించుకుంటుండగా.. మరికొందరు అదనంగా స్లాబులు వేసి చకచకా పనులు పూర్తి చేసుకుంటున్నారు. అనుమతి ప్రకారం తీసుకున్న అంతస్తులకే ఫీజు కడుతుండగా మిగతా వాటికి ఎగ్గొడుతుండటంతో బల్దియాకు నష్టం వాటిల్లుతోంది. గత మూడేళ్ల వ్యవధిలో అక్రమ అంతస్తులు భారీగానే ఉంటాయని ప్లానర్లే చెబుతున్నారు.

**నిజామాబాద్ నగరంలో..**

నిజామాబాద్ మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థగా 2005లో మారింది. సుమారు 21 ఏళ్లు దాటింది. నగరంలో చాలా భవనాలకు సంబంధించిన లెక్కలు పట్టణ ప్రణాళిక విభాగం వద్ద లేవని సమాచారం. అనుమతులు తీసుకునే సమయంలో ఉన్న లెక్కలు తప్పించి అదనంగా అక్రమంగా నిర్మించుకునే అంతస్తుల వివరాలు మాత్రం లేకుండా పోయాయి. జీ+1 నుంచి జీ+5 వరకు భవనాలు, పెంట్‌హౌస్‌లు ఎన్ని ఉన్నాయని వివరాలు మాత్రం తీయడం లేదు. అనుమతి లేకుండా సెట్ బ్యాక్ పాటించని భవనాలకు సంబంధించి ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. వీటిలో కొన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు ఇస్తుండగా ఇలాంటి స్పందన లేకుండా పోతుంది.

**చిన్న వీధులు.. పెద్ద భవనాలు..**

వాస్తవానికి నగరంలో 30 అడుగుల రోడ్డు ఉంటే ఇంటి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది భవిష్యత్తులో రహదారి వెడల్పు చేసేందుకు వీలుగా 20 అడుగుల రోడ్డు ఉన్నట్లయితే నగరపాలికకు ఐదు ఫీట్లు గిఫ్ట్ చేయాల్సి వస్తుంది.

ప్లాట్ ఏరియాను బట్టి రోడ్డు వైపు 5 ఫీట్లు మిగతా మూడు వైపులా మూడున్నర ఫీట్లు వెనక్కి జరిగి స్లాబు వేసుకోవాలి. సెట్ బ్యాక్ కోసం వదిలిన స్థలంలో ప్రహరీ, స్లాబు, సెప్టిక్ ట్యాంకు, బోర్వెల్ ఉండకూడదు. కానీ కొందరు ఆటోలు, కార్లు కూడా రాకపోకలు సాగించని చిన్నచిన్న వీధుల్లో కూడా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగితే కనీసం అగ్నిమాపక వాహనం కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి నిబంధనలు పాటించని ఇంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఔటర్ రింగు రోడ్డుకు రూ.500 కోట్లు కేటాయించాలి: కేంద్ర మంత్రిని కోరిన ఎమ్మెల్యే

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.500 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే శనివారం కేంద్ర మంత్రిని కలిశారు. గతంలో రూ.550 కోట్ల వ్యయంతో 54 కిలోమీటర్ల పొడవుతో కామారెడ్డి చుట్టు ఔటర్ రింగు రోడ్డు విషయమై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి స్థల పరిశీలన, వ్యయం ప్రణాళికలు చేయాలని విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న ప్రధాన రహదారుల పొడిగింపు, అభివృద్ధి, నూతన రహదారుల ఏర్పాటు గురించి సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్టియర్ ఫండ్ కింద లింగాపూర్ నుంచి టేక్రియాల్ వరకు రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. రింగు రోడ్డు పనుల ప్రణాళిక వేగవంతం చేయటానికి అధికారులను మంత్రి ఆదేశించారని, రూ.50 కోట్ల నిధుల కేటాయింపు విషయమై కూడా సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.





## చిన్నారుల మిస్సింగ్ విషాదాంతం..

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో చిన్నారుల అదృశ్యాలు విషాదాంతమవుతున్నాయి. ఇటీవల ఐదుగురు చిన్నారుల అదృశ్యం కేసులో ముగ్గురు అమ్మాయిలు కామారెడ్డి పెద్ద చెరువులో తండ్రి చేతిలో హత్యకు గురి కాగా అదృశ్యమైన మరొక ఇద్దరు చిన్నారులు శనివారం ఓ పాడుబడిన బావిలో శవాలై తేలారు. చిన్నారుల అదృశ్యం.. మృతి ఘటనలు కామారెడ్డి పట్టణంలో కలకలం రేపుతున్నాయి. ఈనెల 6న గోసంగి కాలనీకి చెందిన పనేటి శారద కుమారుడు సింహాద్రి (10) అలియాస్ నరసింహ, ఆమె అన్న కుమారుడు కొడందం విజయ్ (9) మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయారు. దీంతో ఆమె 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. అప్పటినుంచి పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. శనివారం రాజా నగర్ కాలనీలో ఓ పాడుబడిన బావిలో చిన్నారులిద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించారు. పిల్లలు బావిలో చేపలను పడుతూ ప్రమాదవశాత్తు జారి పడి చనిపోయినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



## వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** జుక్కల్ నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పైప్‌లైన్‌ల మరమ్మతులు, నిర్వహణ పనులను తక్షణమే పూర్తిచేసి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. మోటార్ల సమస్యలు వంటి చిన్నచిన్న లోపాలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇందూరు తిరుమలలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

**అక్షరటుడే, ఇందూరు:** మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమలలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు శనివారం ఉదయం నిత్య హవన పూర్ణాహుతి తర్వాత సామూహిక భగవద్గీత పఠన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి షాక్తా పరిషత్ బృందం గురువు పవన్ శర్మ, మహిళా శిష్య బృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం, లలిత సహస్రనామ పారాయణం, సౌందర్యలహరి సామూహిక గానం ఏర్పాటు చేశారు. భక్తులు భక్తి పరవశ్యంలో మునిగిపోయారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు నిజామాబాద్ నగరం నుంచే కాకుండా నర్సింగ్‌పల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. అశ్వ వాహనంపై వచ్చిన శ్రీవారు సిరి సంపదలను తీసుకొని వస్తాడని దేవనాథ జీయర్ స్వామి అన్నారు. సాయంత్రం పూర్ణాహుతి తరువాత శ్రీవారిని అశ్వవాహనంపై ఊరేగించి దోపోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆళ్వారుల్లో చివరి ఆళ్వారు అయిన తిరుమంగై ఆళ్వారు జీవిత చరిత్రను దోపోత్సవంగా ప్రదర్శించారు. తిరుమంగై ఆళ్వారుగా మారిన పరకాలుని కథ రూపకమే దోపోత్సవం. ఆనాడు రాజుగా పరిపాలించిన పరకాలుడు కుముదవల్లి ప్రేమలో పడిన తర్వాత 1008 మంది శ్రీవైష్ణవులకు ప్రతిరోజు భోజనాలు ఏర్పాటు చేసి.. భోజనాలు (తదియారాధన) ఏర్పాటు చేయడానికి తన దగ్గర ఉన్న సంపద సరిపోకపోతే దారిదోపిడీలు చేస్తూ ఆ దోపిడీ చేసిన సొమ్ముతో శ్రీవైష్ణవులకు తదియారాధన కార్యక్రమాన్ని కొనసాగించారని తెలిపారు. గ్రామానికి చెందిన



ఆడబిడ్డలు మంగళహారతులతో స్వామి వారిని ఆహ్వానించారు. గ్రామ యువత ఆటపాటలతో అశ్వవాహన ఊరేగింపులో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలు దేవనాథ స్వామి వారి మంగళా శాసనాలతో జరగడం పూర్వ జన్మ సుకృతమని ఆలయ ధర్మకర్త నరసింహారెడ్డి అన్నారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి తోపాటు సినీ నిర్మాతలైన దిల్ రాజు, శిరీష్ విజయసింహా రెడ్డి, డీసీసీ నాయకుడు బస్వారెడ్డి, సాయ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాములు, నర్సారెడ్డి, పృథ్వీ, ప్రవీణ్, నరాల సుధాకర్, రమేష్, భాస్కర్, నరేందర్, గంగారెడ్డి, సాయిలు, రాములు, మురళి, యజ్ఞాచార్యులు అనంత్ కుమార్ ఆచార్యతో పాటు ఆలయ అర్చక స్వాములు సంపత్ కుమారాచార్య , రోహిత్ కుమారాచార్యులు, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా: గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గ నిరుద్యోగ యువత కోసం ఈనెల 22 న జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలోని పార్శిరాములు కల్యాణ మండపంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 22 కంపెనీల ప్రతినిధులతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందన్నారు. ఆయా కంపెనీల్లో దాదాపు 4,886 ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు పేర్కొన్నారు. మల్టీ నేషనల్, ఫార్మా, టెలికాం లాంటి దిగ్గజ కంపెనీలు తమను సంప్రదించాయన్నారు. నియోజకవర్గ యువతీయువకులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి 9 రోజులు సమయం ఉందని, ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగ మేళా నాటికి మరొక 12 కంపెనీలు వస్తాయని, సుమారు 40 కంపెనీల ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి రుసుము లేదన్నారు. జీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జాబ్‌మేళా ఉంటుందన్నారు. త్వరలో దోమకొండ, బీబీపేట మండలాలను పైలెట్‌గా తీసుకుని ఆ మండలాల్లో యువతులకు ఉపాధి మార్గాలు చూపిస్తామని ఆయన తెలిపారు. త్వరలో విధివిధానాలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం మీది మహేష్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, జూలూరి సుధాకర్, రంగ రమేష్‌గౌడ్, సబ్బని హరికృష్ణ, గంగారాములు, బండారి శ్రీకాంత్, బల్ల శ్రీనివాస్, రాజశేఖర్, సునీల్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.







# ‘పది’ పరీక్షలు ప్రారంభం..

ఉమ్మడి జిల్లాలో ‘పది’ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే కేంద్రం లోపలికి అనుమతించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షలను పర్యవేక్షించారు. ఈ ఏడాది ఎస్సెస్సీ పరీక్షలు సుదీర్ఘంగా నెలరోజుల పాటు జరగనున్నాయి. – అక్షరటుడే, నెట్‌వర్క్















## వైబ్రేషన్స్ క్లాంప్లియన్స్ 2కే26లో ఆర్మూర్ విద్యార్థుల ప్రతిభ

**అక్షరటుడే, ఆర్మూర్:** హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైబ్రేషన్స్‌కాంప్లియన్స్ 2కే 26లో ఆర్మూర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. విద్యార్థులకు (క్లేఆర్ట్) మట్టి కళా ప్రాచీన సాంప్రదాయంలో భాగంగా ఎంచుకున్న అంశం చేర్యాల క్లే ఆర్ట్‌లో చంద్రభాగ (బీకాం సీఏ) రెండోసంవత్సరం విద్యార్థిని మొదటి స్థానంలో నిలవగా, ఫ్యాషన్ షోలో సీపీ వర్షిణి (బీకాం సీఏ) మూడవ సంవత్సరం ద్వితీయ బహుమతిని, రీల్ అండ్ రోల్ పోటీలో భాగంగా మూడవ విజేతగా నిలిచిన టి.గంగు (బీకాం సీఏ) మూడవ సంవత్సరం విద్యార్థిని ఈ బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, అధ్యాపక బృందం, విద్యార్థినులు అభినందించారు.



## సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని 25వ డివిజన్‌లో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 25వ డివిజన్ బీఆర్ యూత్ ఫోర్స్, డివిజన్ అధ్యక్షుడు చింతకాయల రాజు (రాజేష్) ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఇందులో డివిజన్ ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని హెల్త్ చెకప్ చేయించుకున్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు భానుష్, సాయి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి భారీగా వెండి నగలు, నగదు, కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ గ్రామానికి చెందిన వడ్డే పద్మ గతనెల 22న పని నిమిత్తం తన కుమార్తెతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఆమె ఇంటికి తాళం వేసి వెళ్లగా, గుర్తు తెలియని దొంగలు ఇంటి తలుపు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉంచిన సుమారు 3 తులాలు బంగారు పుస్తెలు తాడు, 15 తులాలు వెండి నడుము గొలుసు, 15 తులాలు బ్రాస్‌లెట్లు, 8 తులాలు వెండి ముద్దలు, కొంత నగదును దొంగిలించి వెళ్లారు. అదే సమయంలో సమీపంలోని మరో ఇంటి తలుపు కూడా పగులగొట్టి అక్కడ ఉంచిన సుమారు 10 తులాలు వెండి ముద్దలను కూడా దొంగిలించినట్లు గుర్తించిన పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సీఐలు రామన్, సంతోష్ ఎస్సైల బృందం రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. శనివారం ఉదయం టెక్రియల్ ఎక్స్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన సిద్దిపేట జిల్లాకు చెందిన నూనె నర్సింలు, మరో మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా రెండు నెలలుగా దేవునిపల్లి, తాడ్వాయి సదాశివనగర్ మండలాల్లో మూడు ఇళ్లలో దొంగతనాలు చేయడంతో పాటు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కాపర్ కాయిల్స్, ఎర్త్ వైర్లు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. నలుగురు కలిసి ఒక ప్రత్యేక గ్యాంగ్‌గా




ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నారు. కేవలం ఇళ్లలోనే కాకుండా, నిర్మానుష్య ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేసి, వాటిలోని విలువైన కాపర్ కాయిల్స్, ఎర్త్ పట్టీలను కూడా దొంగిలిస్తున్నట్లు విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. త్వరలోనే మిగతా ఇద్దరిని పట్టుకొని అరెస్ట్ చేస్తామని తెలిపారు. నిందుతుల వద్ద నుండి 20 తులాల వెండి కాళ్ల పట్టీలు, 5 తులాల వెండి ముద్ద, 15 తులాల వెండి కాళ్ల పట్టీలు, ఒక ఫోన్, ఐక్యూ మొబైల్ ఫోన్, రూ.4,500 నగదు, 15 కిలోల రాగి వైరు, 10 కిలోల రాగి ఎర్త్ వైరు, ఎక్సల్ వాహనం, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నూనె నర్సింలుపై గతంలో సైబరాబాద్‌లోని శామీర్‌పేట్, సిద్దిపేట జిల్లాలోని రైపోల్, తొగుట, కుకునూర్‌పల్లి పోలీసు స్టేషన్లలో చోరీకేసులు ఉన్నాయని, మైనర్‌పై మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు, రామగుండం, సైబరాబాద్ కమిషనరేట్లలో 9 చోరీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో ఫీజుల కోసం రూ.15వేల కోట్లు కేటాయించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఫీజు బకాయిల కోసం రూ.15వేలు కోట్లు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల ప్రభుత్వ నిధుల విడుదలపై శ్వేతపత్రం విడుదల చేయాలని నీల నాగరాజు అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగారిస్తే ప్రభుత్వ పీఠం కదిలిస్తామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, ఈ బడ్జెట్‌లో ఫీజులకు రూ.పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్‌తో ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ‘ఫీజు పోరు’ దీక్ష చేపడుతున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే ఫీజుల బకాయిలను విడుదల చేస్తామని, బీసీ విద్యార్థుల పూర్తి ఫీజులను చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. రూ.ఐదు లక్షలతో ప్రతి విద్యార్థికి విద్యార్థి భరోసా కార్డులను అందజేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా నేటి వరకు అమలు చేయకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. గత రెండేళ్ల కాలంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని రాష్ట్రమంతా విద్యార్థులంతా ఉద్యమిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ ఉందని అబద్ధపు మాటలు చెబుతుందని నాగరాజు మండిపడ్డారు. కార్యక్రమంలో సాయి విగ్నేష్, రాజ్ కుమార్, మనిరాజ్, సుమన్, గణేష్, శివ, నిఖిల్, సందీప్, వరుణ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ వాలీబాల్ పోటీలకు గాంధారి క్రీడాకారుడు



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని నాగ్లూర్ గ్రామానికి చెందిన సీహెచ్ చరణ్ మార్చి 19న గ్వాలియర్ మధ్యప్రదేశ్‌లో జరుగనున్న నేషనల్ వాలీబాల్ టోర్నీకి ఎంపికైనట్లు తండ్రి సాయిలు తెలిపారు. తమ కుమారుడు నేషనల్ స్థాయికి ఎదగడం చాలా గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సీహెచ్ చరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## ఆటో ఢీకొని ఇద్దరు దుర్మరణం

**అక్షరటుడే, ఆర్మూర్:** అతివేగం ఇద్దరి ప్రాణాలను తీసింది.. రోడ్లపై వేగంగా వెళ్లి ఇతర ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు పెడచెవిన పెడుతున్నారు. వారి ర్యాష్ డ్రైవింగ్ కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్త అతివేగం కారణంగా ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పిప్రి వద్ద శనివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఓ ఆటో డ్రైవర్ అతివేగంగా తన ఆటోతో పిప్రి వైపు వస్తూ.. గ్రామ సమీపంలో ఓ స్కూటీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు. అనంతరం మృతదేహాలను ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

## బోరుబావి వద్ద యువకుడి అనుమానాస్పద మృతి

**అక్షరటుడే, బోధన్:** బోరుబావి వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన ఎడపల్లి మండలం పోచారం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రమ తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన బాబుల గంగాధర్ (19) పోచారం శివారు ప్రాంతంలోని దూపల్లి రైల్వే గేటు వద్ద ఉన్న బోరు బావి పక్కన మృతదేహంగా కనిపించాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి యువకుడి మృతిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు.

# అక్రమంగా వినియోగిస్తున్న 30 ఎల్పీజీ సిలిండర్ల స్వాధీనం

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని పలు వాణిజ్య సంస్థల్లో అక్రమంగా వినియోగిస్తున్న 30 గృహ వినియోగ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. జిల్లాలోని నస్రుల్లాబాద్, నాగిరెడ్డిపేట, మాచారెడ్డి, పాల్వంచ, భిక్కనూరు మండలాల్లో పలు హోటళ్లు, మెస్‌లు, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. అధికారుల 23 వాణిజ్య సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. వాటిల్లో గృహ వినియోగానికి సంబంధించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. దాంతో 30 సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు సంబంధిత వాణిజ్య సంస్థలపై కేసులు నమోదు చేశారు. అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో శనివారం 5,595 గ్యాస్ బుకింగ్స్ జరగగా 4,498 రీఫిల్స్ పంపిణీ చేశామని తెలిపారు. ప్రస్తుతం ఏజన్సీల వద్ద 5,585 సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందన్నారు. ఏజన్సీలు సొంతంగా ఇండెంట్లు చేస్తుండగా ప్లాంట్ల ద్వారా కూడా నిరంతరం సరఫరా జరుగుతున్నందున ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ సజావుగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని వినియోగదారులు అనవసరంగా భయపడి సిలిండర్లు బుక్ చేసుకోవడం, నిల్వ ఉంచుకోవడం చేయవద్దని కోరారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మార్గదర్శకాల ప్రకారం గ్యాస్ సిలిండర్లు



రెండో సారి బుక్ చేసుకోవడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల విరామం ఉండాలన్నారు. గృహ వినియోగ సిలిండర్ల వినియోగంపై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని, అక్రమంగా సిలిండర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.